KR TV
# మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 71 | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## నేటి మాట

ఏ పరిస్థితులలో ఉన్నా నీ కర్తవ్యం
నీకు గుర్తుంటే జరగాల్సిన పనులు
వాతంట అవే జరుగుతాయి



-స్వామి వివేకానంద

## తెలంగాణలో భారీగా
# ఐఏఎస్ అధికారుల బదిలీలు

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ భారీ సంఖ్యలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు మొత్తం 45 మంది అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రాష్ట్ర సచివాలయంలోని కీలక శాఖల నుంచి జిల్లాల కలెక్టర్ల వరకు అనేక మార్పులు జరిగాయి. ఇందులో ఐఏఎస్ సంజయ్ కుమార్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. ఐఏఎస్ ఎన్.శ్రీధర్ పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. అదేవిధంగా ఆయన మైన్స్, జియాలజీ శాఖ బాధ్యతల్లో కూడా కొనసాగుతారు. రాహుల్ బొజ్జ ఇరిగేషన్ శాఖ నుంచి సాధారణ పరిపాలన (రాజకీయ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈయనకు బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా కట్టబెట్టారు. ఢిల్లీ తెలంగాణ భవన్ నుంచి ఆర్థిక, ప్రణాళిక శాఖ సెక్రటరీగా ఉన్న గౌరవ్ ఉప్పల్ టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా నియమితులయ్యారు. ముషారఫ్ అలీ ఫారూఖీ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ నుంచి కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 3వ డిస్కమ్ సీఎండీగా బదిలీ అయ్యారు. జితేష్ వి.పాటిల్ టీజీఎస్పీడీసీఎల్ కొత్త సీఎండీగా బాధ్యతలు చేపట్టనున్నారు.




ఇతర కీలక పోస్టింగ్‌లు ఇలా: మహబూబ్‌నగర్ కలెక్టర్ ఉన్న బి.విజియేంద్ర తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా, ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా నియమితులయ్యారు. దివ్య దేవరాజన్ సెర్ప్ సీఈవోగా కొనసాగుతూనే ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా అదనపు బాధ్యతల చేపట్టనున్నారు. మహబూబాబాద్ కలెక్టర్‌గా ఉన్న అద్వైత్ కుమార్ సింగ్ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సమన్వయ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా ఉన్న ఎం.హనుమంతరావు నుంచి దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

## తెలంగాణలో భూకంపం

- రెండు జిల్లాలలో కంపించిన భూమి
- అర్ధరాత్రి భూకంపం
- రిక్టర్ స్కేల్ 3.9 తీవ్రత
- మూడు సెకన్ల ప్రకంపనలు
- భయంతో బయటకు ప్రజలు
- గతంలోనూ ప్రకంపనలు




## క్షుద్రపూజల కోసం కూతురిని నరికి చంపిన సవతి తల్లి

- గోరఖ్‌పూర్‌లో దారుణ ఘటన
- మూడు ఏళ్ల బాలిక హత్య
- గొడ్డలితో తల నరికి చంపిన సవతి తల్లి
- క్షుద్రపూజల కోసమేనా? అనుమానం
- నిందితురాలు పోలీసుల అదుపులో




## పింఛన్‌దారులకు తీపికబురు

- రూ.500 పెంచే యోచనలో తెలంగాణ సర్కార్!
- లబ్ధిదారులకు లాభం
- ఖజానాపై భారం
- నెలవారీ ఖర్చు రూ.950 కోట్లు
- పూర్తి హామీ ఎప్పటికి?




# 90 రోజుల యాక్షన్ ప్లాన్
## ఇక క్షేత్రస్థాయిలోనే సీఎం, మంత్రులు!

- శాఖల వారీగా నివేదికల ఆదేశం
- తక్షణ పరిష్కారాలకు నిధుల మంజూరు
- గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- వ్యక్తిగత వినతుల కోసం ప్రత్యేక వింగ్
- సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్ష
- ఎన్నికల ముందే 'ఫీల్ గుడ్' లక్ష్యం

**న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్):**

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రభుత్వం ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం మొత్తం గ్రామాలు, పట్టణాల్లో పర్యటించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సాధ్యమైన వాటికి వెంటనే పరిష్కారం చూపాలని భావిస్తున్నారు. అందుకోసం ప్రతి డిపార్ట్‌మెంట్ వారీగా ఏయే కార్యక్రమాలు చేపట్టవచ్చనే నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు తెలిసింది.

**3 నెలల పాటు ప్రజాక్షేత్రంలోనే..**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 16న మొదలై మార్చి 30న ముగియనున్నాయి. ఆ తర్వాత రెండు, మూడు రోజుల విరామంతో క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.




మిగతాది 2 లో

## ఏకే-47తో డైరెక్ట్‌గా పోలీసుల ముందుకు..

- కీలక మావోయిస్టు నేత మాసే బార్సా సరెండర్
- బస్తర్‌లో మావోయిస్టులకు భారీ షాక్
- రెండు దశాబ్దాల అండర్‌గ్రౌండ్ జీవితం
- ఎస్పీ నిఖిల్ రఖేచా ఎదుట లొంగుబాటు
- పునరావాసం కల్పిస్తామని హామీ




## ఏకంగా మహిళా మంత్రిపై దాడి

- ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు
- కన్నూర్ రైల్వే స్టేషన్‌లో తోపులాట
- వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వద్ద ఘటన
- రాజకీయంగా వేడెక్కిన వివాదం
- సీఎం పినరయి విజయన్ ఖండన
- కాంగ్రెస్ నేతల కౌంటర్ ఆరోపణలు




## డొనాల్డ్ ట్రంప్‌నకు దెబ్బమీద దెబ్బ

- అమెరికా ఫెడరల్ కోర్టు సంచలన తీర్పు
- ట్రంప్ వలస విధానానికి షాక్
- మూడో దేశాలకు పంపడం చట్టవిరుద్ధం
- 'డ్యూ ప్రాసెస్' హక్కు ఉల్లంఘన
- జడ్జి బ్రియాన్ మర్ఫీ 81 పేజీల తీర్పు
- అమలుపై 15 రోజుల స్టే




## క్రికెట్ మ్యాచ్‌లో అపశ్రుతి
### డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు గాయం

- మణిపాల్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రవాణా
- కబడ్డీ పోటీల్లోనూ ఎమ్మెల్యేలకు గాయాలు
- రనౌట్ తప్పించుకునే క్రమంలో ప్రమాదం
- కాలర్ బోన్ ఫ్రాక్చర్‌తో ఎమ్మెల్సీ శ్రీకాంత్ గాయం




## ఇది ముమ్మాటికి కుట్రే ఎన్‌సీఈఆర్టీ పై
# సుప్రీం సీరియస్
### వివాదాస్పద పుస్తకం బ్యాన్

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పుస్తకంలో న్యాయ వ్యవస్థలో అవినీతిపై పాఠ్యాంశం చేర్చడాన్ని సుప్రీంకోర్టు సీరియస్ కామెంట్స్ చేసింది. ఈ పాఠ్యాంశం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనని సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు ఇవాళ విచారణ ప్రారంభించింది. ఈ సందర్భంగా సీజేఐ తీవ్రంగా స్పందించారు. మీరు కాల్పులు జరిపారు, న్యాయవ్యవస్థ రక్తమోడుతోంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపరిచేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోందని, దీన్ని ఇలాగే వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం




ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో అవినీతిని వివరించేందుకు ఒక పూర్తి అధ్యాయాన్ని కేటాయించిన ఎన్‌సీఈఆర్టీ కోర్టుల విశిష్ట చరిత్రను మాత్రం విస్మరించిందని మండిపడ్డారు. జవాబుదారీతనం ఏర్పడే వరకు ఈ వ్యవహారాన్ని మేము వదిలిపెట్టబోమన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఐదు ఆదేశాలు జారీ చేసింది. వీటిని అతిక్రమిస్తే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# రాజ్యసభ స్థానాలు ఖాళీ
## మల్లికార్జున ఖర్గేతో జగ్గారెడ్డి భేటీ

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణలో ఖాళీ కాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీ విషయంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీ కాంగ్రెస్‌లో సీనియర్ నేతలు వి.హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌కు రాజ్యసభ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని. జెట్టి కుసుమ కుమార్ యూత్ కాంగ్రెస్ లీడర్, స్టూడెంట్ లీడర్ తో పాటు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వాడైనందున అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. జెట్టి కుసుమ కుమార్




కుటుంబం ఫ్రీడమ్ ఫైటర్స్ ఫ్యామిలీ అని వారి కుటుంబం అంతా కాంగ్రెస్ లోనే ఉన్నారన్నారు హనుమంతరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవంతో పాటు మూడు సార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారన్నారు.

# డొనాల్డ్ ట్రంప్‌నకు దెబ్బమీద దెబ్బ..

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన కీలక వలస విధానానికి అమెరికా ఫెడరల్ కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. వలసదారులను వారి స్వదేశాలకు కాకుండా, మూడో దేశాలకు బలవంతంగా పంపించివేసే విధానం చట్టవిరుద్ధమని అమెరికా ఫెడరల్ జడ్జి తీర్పునిచ్చారు. వలసదారులను ఏ దేశానికి పంపిస్తున్నారో వారికి ముందుగా తెలియజేయకుండా, ఆ నిర్ణయాన్ని సవాలు చేసే అవకాశం కల్పించకుండా పంపడం రాజ్యాంగ విరుద్ధమని జడ్జి బ్రియాన్ మర్ఫీ స్పష్టం చేశారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తికైనా లభించే 'డ్యూ ప్రాసెస్' చట్టపరమైన సరైన ప్రక్రియ హక్కును ఈ విధానం ఉల్లంఘిస్తోందని 81 పేజీల తీర్పులో పేర్కొన్నారు. వలసదారులకు సంబంధం లేని దేశాలకు వారిని పంపడం వల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేసుకునేందుకు వీలుగా జడ్జి తన ఉత్తర్వుల అమలుపై 15 రోజుల పాటు స్టే విధించారు.

కాగా, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరిహద్దుల వద్ద కఠినమైన ఆంక్షలు విధించింది. ఇందులో భాగంగా వలసదారులను వారి సొంత దేశాలకు కాకుండా, ఒప్పందాలు కుదుర్చుకున్న ఇతర దేశాలకు పంపించే ప్రక్రియను ప్రారంభించింది. ఈ విషయంపై మానవ హక్కుల సంఘాలు కోర్టులో సవాలు చేయగా.. తాజాగా వారికి అనుకూలంగా అమెరికా ఫెడరల్ కోర్టు సంచలన తీర్పును ఇచ్చింది.

# ఏకంగా మహిళా మంత్రిపై దాడి



న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కేరళ ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వీణా జార్జ్ పై జరిగిన దాడి ఘటనలో కన్నూర్ టౌన్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కేఎస్ యూ)కు చెందిన ఐదుగురు నేతలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం కన్నూర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వెళ్తున్న మంత్రిని కేఎస్‌యూ కార్యకర్తలు అడ్డుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న వైద్య నిర్లక్ష్య ఘటనలపై నిరసిస్తూ వారు నల్లజెండాలతో ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి వీణా జార్జ్‌కు మెడ భాగంతో పాటు చేతికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె కన్నూర్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు. ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఐదుగురు ప్రధాన నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో కేఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎంసీ అతుల్, జిల్లా ట్రెజరర్ అక్షయ్ మట్టూల్, సీహెచ్ ముబాజ్, బితుల్ బాలన్, మహమ్మద్ యాసిన్ ఉన్నారు.

ఈ ఘటనను సీఎం పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్య నిరసన కాదని, ఒక మహిళా మంత్రిపై జరిగిన క్రూరమైన దాడి అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. మంత్రి చుట్టూ 30 మందికి పైగా పోలీసులు ఉన్నారని, విద్యార్థులు ఆమె దగ్గరకు కూడా వెళ్లలేదని వారు వాదిస్తున్నారు. ఇది కేవలం సానుభూతి కోసం ఆడుతున్న రాజకీయ డ్రామా అని విమర్శించారు.

# రాజ్యసభ స్థానాలు ఖాళీ.. మల్లికార్జున ఖర్గేతో జగ్గారెడ్డి భేటీ

మొదటి పేజీ తరువాయి

రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారని వయసులో పెద్ద వ్యక్తి, చురుకైన వ్యక్తి అయిన వీహెచ్?కు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

అధిష్టానం హామీ:

తన ప్రతిపాదనపై కమిటీతో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని చెప్పారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలోని రాజ్యసభ అవకాశంపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్‌తో కూడా మాట్లాడినట్లు చెప్పారు. తాను రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని అయితే రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని జగ్గారెడ్డి చెప్పారు.

# క్రికెట్ మ్యాచ్‌లో అపశ్రుతి

## డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు గాయం

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బుధవారం క్రికెట్ ఆడుతున్న సమయంలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గాయపడ్డారు. రనౌట్ నుంచి తప్పించుకునేందుకు క్రీజులో వేగంగా పరుగెత్తే ప్రయత్నంలో అదుపుతప్పి కిందపడిపోయారు. ఆ సమయంలో శరీరం బ్యాలెన్స్ మొత్తం ఎడమ భుజంపైనే పడింది. ఈ క్రమంలో మణికట్టు వద్ద గాయమైంది.

భుజం నొప్పి ఉండటంతో రఘురామకృష్ణరాజును వెంటనే మణిపాల్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. భుజం నొప్పి ఎక్కువవ్వడంతో పాటు, చేతి బొటన వేలికి గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు.

ఇక ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గాయపడ్డారు. తమ జట్టుపై కూతకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి, ఇంకోసారి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పట్టుకునే ప్రయత్నంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వారిపై పడ్డారు. ఈ ఘటనలో పార్థసారథి పాదం భాగంలో, శ్రీకాంత్‌కు భుజం వద్ద కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యాయి. బుధవారం నిర్వహించిన వైద్య పరీక్షల్లో వీరి గాయాలను గుర్తించారు.

# భారత్ - ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు



న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారత్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. ఏఐతో పాటు వ్యవసాయరంగంలో ఒప్పందాలు కుదిరాయి. త్వరలో రెండు దేశాల మధ్య ట్రేడ్ డీల్ సైతం జరుగనుంది. మొత్తం 27 రంగాల్లో భారత్–ఇజ్రాయెల్ పరస్పర సహకారం, యూపీఐ చెల్లింపుపైనా ఇరుదేశాల మధ్య ఎంవోయూ, భారత్–ఇజ్రాయెల్ ఎకనామిక్ ఫోరం ఏర్పాటు, అణు ఇంధన రంగంలో రెండుదేశాల మధ్య సహకారం, ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం చేయాలని నిర్ణయం, ఇరుదేశాల మధ్య 100 ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటు సహా పలు కీలక ఒప్పందాలు జరిగాయి.

మరోవైపు ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెసెట్'ను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోడీ రికార్డు సృష్టించారు. దాంతో పాటు ఇజ్రాయెల్ సోషల్ మీడియా ట్రెండ్స్‌లో మోడీ పేరు టాప్ 3లో నిలవడం విశేషం. ఈ పర్యటన ద్వారా అటు ఉగ్రవాదంపై పోరాటం, ఇటు శాంతి చర్చల విషయంలో రెండు దేశాలు ఒకే తాటిపై ఉన్నాయని ప్రపంచానికి మరోసారి స్పష్టమైంది. మోడీ ఇజ్రాయెల్ పర్యటన ముగింపు సందర్భంగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నేతన్యాహూ భావోద్వేగ ప్రసంగం చేశారు. ఈ పర్యటనను ఆయన 'అద్భుతమైనది'గా అభివర్ణించారు. ఈ పర్యటన కేవలం రెండు దేశాల మధ్య ఒప్పందాలకే పరిమితం కాలేదని, ఇది రెండు మహత్తర మేధస్సులూ, హృదయాలూ కలిసిన సందర్భమని ఆయన వ్యాఖ్యానించారు.

# పింఛన్‌దారులకు తీపికబురు

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, డయాలసిస్ రోగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు తదితరులకు ఆర్థిక సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'చేయూత' పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని నెరవేర్చేందుకు తొలి విడతగా పింఛన్ మొత్తాన్ని కొంత మేర పెంచి, దశలవారీగా పూర్తి స్థాయి హామీని అమలు చేయాలని రేవంత్ సర్కార్ యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఒకేసారి కాకుండా ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లపై రూ.500 అదనంగా పెంచాలని ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్లుగా సమాచారం.

ప్రభుత్వంపై రూ.2,500 కోట్ల అదనపు భారం..

ఒకవేళ 'చేయూత' పింఛన్లపై రూ.500 పెంచితే.. వృద్ధులు, వితంతువులు, ఇతర వర్గాలు ప్రస్తుతం పొందుతున్న రూ.2,016 పింఛన్ రూ.2,516కి పెరిగే అవకాశం ఉంది. ఇక దివ్యాంగులకు అందుతున్న రూ.4,016 కాస్తా రూ. 4,516కి చేరనుంది. పింఛన్ల పెంపు అనేది ప్రస్తుతం సాహసోపేత నిర్ణయం అయినా ప్రభుత్వ ఖజానాపై తీవ్ర ప్రభావం చూపనున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.950 కోట్లు వెచ్చిస్తోంది. తాజాగా 'చేయూత' పింఛన్లపై కేవలం రూ.500 పెంచడం వల్ల ఏడాదికి దాదాపు రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతుందని ఆర్థిక శాఖ లెక్కలు వేసింది. వచ్చే ఎన్నికల నాటికి పింఛన్లను రూ.4 వేల నుంచి రూ.6 వేల స్థాయికి తీసుకెళ్లాలంటే, రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి ఇచ్చే కేటాయింపులను భారీగా పెంచాల్సి ఉంటుంది. అయితే, పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న పేదలకు రూ.500 పింఛన్ పెంపు ఊరటనిచ్చినా, ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం తన పూర్తి హామీని ఎప్పటిలోగా నెరవేరుస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

# తెలంగాణలో భూకంపం

## రెండు జిల్లాలలో కంపించిన భూమి

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణలోని రెండు జిల్లాల్లో భూకంపం సంభవించింది. మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం అర్ధరాత్రి భూమి కంపించింది. రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 3.9గా గుర్తించారు. మంచిర్యాల జిల్లాకు 35 కిలోమీటర్ల దూరంగా భూకంప కేంద్రాన్ని గుర్తించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దులో సైతం భూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో 3సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ఇళ్లలోని వస్తువులు ఒక్కసారిగా కిందపడ్డాయి.

గాఢ నిద్రలో ఉన్న ప్రజలు భూమి కంపించడంతో లేచి బయటకు పరుగులు తీశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం భూకంపం వల్ల వస్తువులు కదిలిన సీసీ టీవీ ఫుటేజ్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే కొన్ని నెలల క్రితం సైతం రాష్ట్రంలో భూమి కంపించిన సంగతి తెలిసిందే. కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో భూమి కంపించింది. ఆ సమయంలో ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

# ఏకే-47తో డైరెక్ట్‌గా పోలీసుల ముందుకు..

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్ డివిజన్‌లో మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా సాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీలో డివిజనల్ కమిటీ మెంబర్ స్థాయి నేతగా ఉన్న మాసే బార్సా బుధవారం కాంకేర్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాంకేర్ జిల్లా చింద్‌పాదర్ గ్రామానికి చెందిన మాసే బార్సా, ఉత్తర బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి వెన్నదన్నుగా నిలిచారు. తాజాగా ఆమె తన వెంట ఉన్న అత్యంత శక్తివంతమైన ఏకే–47 రైఫిల్‌ను తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు.

రెండు దశాబ్దాలుగా దండకారణ్యంలోనే.. 2003 నుంచి సుమారు రెండు దశాబ్దాలకు పైగా మాసే బార్సా దండకారణ్యం, అబూజ్‌మద్, ఉత్తర బస్తర్ అడవుల్లో చురుగ్గా పనిచేశారు. పార్టీలో కీలకమైన మిలిటరీ విభాగాల్లో ఆమె నాయకత్వం వహించారు. అటవీ ప్రాంతం నుంచి ఎలాగోలా బయటపడిన మాసే బార్సా, నేరుగా కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ రఖేచా వద్దకు చేరుకుని లొంగిపోయారు. మావోయిస్టు పార్టీని విడిలి తిరిగి జనజీవన స్రవంతిలో కలవాలనే బలమైన ఆకాంక్షతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా ఎస్పీ నిఖిల్ రఖేచా మాట్లాడుతూ.. మాసే బార్సా వంటి కీలక నేత లొంగిపోవడం మావోయిస్టు వ్యవస్థను మరింత బలహీనపరుస్తుందని అన్నారు. సరెండర్ అయిన వారికి ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల ఆర్థిక సాయంతో తక్షణమే పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు.

# ఇది ముమ్మాటికి కుట్రే ఎన్‌సీఈఆర్టి పై సుప్రీం సీరియస్..

## వివాదాస్పద పుస్తకం బ్యాన్

మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు జారీ చేసిన 5 ప్రధాన ఆదేశాలు: వివాదాస్పదమైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకానికి సంబంధించిన అన్ని హార్డ్ కాపీలను (పుస్తకాలను), డిజిటల్ వెర్షన్లను తక్షణమే మార్కెట్ నుండి, పాఠశాలలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి తొలగించాలి.

పుస్తకాల స్వాధీనం మరియు నివేదిక: ఇప్పటికే పంపిణీ అయిన అన్ని పుస్తకాలను స్వాధీనం చేసుకోవాలని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కు ఆదేశం

ఒకవేళ ఎక్కడైనా ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నా ఉపాధ్యాయులు వాటిని ఉపయోగించి పాఠాలు బోధించకూడదు. భౌతిక లేదా డిజిటల్ మాధ్యమాల ద్వారా ఈ కంటెంట్‌ను ప్రచారం చేయకూడదు

ఈ పుస్తకానికి సంబంధించిన ముద్రణను, పంపిణీని పూర్తిగా నిలిపివేయాలి.

ఆ వివాదాస్పద పాఠ్యాంశాన్ని రూపొందించిన నేషనల్ సిలబీ బోర్డ్ సభ్యుల పేర్లు, వారి అర్హతలు, ఆ చాప్టర్‌ను ఆమోదించిన సమావేశం తాలూకు అసలు మినిట్స్ (చర్చా పత్రాలు) కోర్టు ముందు ఉంచాలి

ఈ అంశానికి బాధ్యులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఆదేశిస్తూ కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి, ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్‌కు ఈ సందర్భంగా ధర్మాసనం నోటీసులు జారీ చేశారు. ఈ విషయంలో మరింత లోతుగా విచారణ జరపాలంటూ తదుపరి విచారణ వచ్చే నెల 11కు వాయిదా వేసింది. కాగా ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్టి క్షమాపణలు చెప్పింది. కారణమైన వారిని కనిపెడతామని సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు.

# జూబ్లిహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం..

## దుస్తుల షోరూంలో చెలరేగిన మంటలు

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జూబ్లిహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రోడ్ నంబర్ 36లో మంగళగౌరి షోరూమ్‌లో మంటలు చెలరేగాయి. అక్కడ భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో పాటు ప్రాంతమంతా భారీగా పొగలు వ్యాపించాయి. పక్క భవనాలకు కూడా మంటలు వ్యాపిస్తున్నాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు. షాప్ ముందు ఏర్పాటు చేసిన టెంపుల్ సెట్ షార్ట్ సర్క్యూట్ వల్ల అంటుకోవడం వల్లనే ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఉదయం షోరూ తెరుస్తున్న సమయంలో నిప్పురవ్వలు చెలరేగి టెంపుల్ సెట్ అంటుకున్నట్టు సమాచారం. టెంపుల్ సెట్ పూర్తిగా కాలిపోగా ఇప్పటికే షోరూంలోకి సైతం మంటలు వ్యాపించి దుస్తులన్నీ కాలిపోతున్నాయి. భవనం మొత్తం మంటలు, దట్టమైన పొగతో నిండిపోయింది. మంటలు భారీగా ఎగిసి పడుతుండటంతో రోడ్డుపై నుండి వెళ్లే వాహనాలను సైతం నిలిపివేశారు. ప్రస్తుతం షోరూం సిబ్బంది అంతా బయటే ఉన్నట్టు తెలుస్తోంది. షోరూం లోపల ఎవరూ లేరని పోలీసులు చెబుతున్నారు.

# క్షుద్రపూజల కోసం కూతురిని నరికి చంపిన సవతి తల్లి

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): యూపీలో దారుణం చోటు చేసుకుంది. 3ఏళ్ల కూతురును సవతి తల్లి తల నరికి హతమార్చింది. ఈ ఘటన గోరఖ్‌పూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. త్రివేణి మౌర్య అనే వ్యక్తి భార్య ఏడాది క్రితం మరణించడంతో అతడు మరొకరిని వివాహం చేసుకున్నాడు. కాగా మంగళవారం రాత్రి 11 గంటలకు తన భార్య బయటకు వెళ్లడం త్రివేణి చూశాడు. ఆ సమయంలో భార్య ఎప్పుడూ బయటకు వెళ్లకపోవడంతో అనుమానం వచ్చి అతడు ఆమె కోసం బయటకు వచ్చి వెతకడం మొదలు పెట్టాడు. చుట్టుపక్కలవాళ్లను సైతం సహాయం కోరడంతో వెతికేందుకు ఆయన వెంట వెళ్లారు.

కానీ ఆ లోపే ప్లాన్ ప్రకారం త్రివేణి భార్య తిరిగి ఇంటికి వచ్చి మూడేళ్ల కుమార్తెను గొడ్డలితో దారుణంగా నరికి హత్య చేసింది. ఆమె తల శరీరం నుండి వేరు పడటం చూసి షాక్ అయ్యాడు. గ్రామస్థులు మహిళను పట్టుకుని పోలీసుకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. హత్య చేసిన గదిలో దేవతల ఫోటోలు ఉండటంతో క్షుద్రపూజలు నేర్చుకునేందుకే హత్య చేసిందని అనుమానిస్తున్నారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది.

# మమ్మీ డాడీ నన్ను క్షమించండి.. ప్రేమ విఫలమై మరో విద్యార్థిని ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

న్యూస్ డెస్క్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో ప్రేమ విఫలమై యువతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లోనే ముగ్గురు యువతులు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రేమించినవాడు మరో యువతికి దగ్గరయ్యాడని కోమలి ఆత్మహత్య చేసుకుంది. మరోవైపు వనపర్తి జిల్లాకు చెందిన వసంత అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీ హాస్టల్ లో ఆత్మహత్యకు పాల్పడింది. ఇప్పుడే పెళ్లి వద్దని చెప్పినందుకు వసంత బావ ఆత్మహత్య చేసుకోగా.. భయంతో వసంత సైతం హాస్టల్ లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఇక తాజాగా ఏపీలో మరో ఘటన చోటు చేసుకుంది. విశాఖ పట్నానికి చెందిన రజిని అనే విద్యార్థిని ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకుంది. రజిని మధురవాడలోని ప్రైవేట్ కాలేజీలో ఫిజియోథెరపీ సెకండ్ ఇయర్ చదువుతోంది. అయితే ప్రేమించిన వ్యక్తి తనను వదిలేశాడని, అతడిని వదిలి ఉండలేకపోతున్నా అంటూ సూసైడ్ నోట్ రాసి రజిని ఆత్మహత్య చేసుకుంది. అమ్మా.. నాన్న నన్ను క్షమించడండి అంటూ సూసైడ్ నోట్ రాసింది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో రజిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

ఆయనకు గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. నారాయణపేట కలెక్టర్‌గా ఉన్న సిక్త పట్నాయక్ ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీగా వెళ్లనున్నారు. జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న సందీప్ కుమార్ ఝా జనగాం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కరీంనగర్ కలెక్టర్‌గా పామెలా సత్పతి కార్మిక శాఖ స్పెషల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. మెదక్ కలెక్టర్‌గా ఉన్న రాహుల్ రాజ్ సహకార శాఖ స్పెషల్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీగా ఉన్న భవేష్ మిశ్రా నుండి అదే శాఖలో స్పెషల్ సెక్రటరీగా రీడిజిగ్నేట్ అయ్యారు.

జిల్లాలకు కొత్త కలెక్టర్లు వీరే..

జనగాం కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల్ కలెక్టర్‌గా వెళ్లనున్నారు. జోగులాంబ గద్వాల్ కలెక్టర్ సంతోష్ బీఎం గిరిజన సంక్షేమ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ నారాయణపేట్ కలెక్టర్‌గా నియామితులయ్యారు. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మహబూబాబాద్ కలెక్టర్‌గా, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కాత్యాయని దేవి వెళ్లనున్నారు. టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా ఫణీంద్రా రెడ్డి నారాయణపేట్ అదనపు కలెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఎటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉన్న చైత్ర మిశ్రా నుంచి కరీంనగర్ కలెక్టర్‌గా వెళ్లనున్నారు. ఇక గరీమా అగర్వాల్‌ను రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియమించారు. వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి, మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా అంకిత్, మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా కష్బూ గుప్తా, హనుమకొండ కలెక్టర్‌గా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్ అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అదనపు సీఈఓగా కె.విద్యా సాగర్, ప్రజావాణి అదనపు నోడల్ అధికారిగా నియామకం ఎం.సురేందర్‌కు బాధ్యతలు కట్టబెట్టారు.

జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మందా మకరందు, మెడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్, వికారాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉమశంకర్ ప్రసాద్, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్ లాల్, మంచిర్యాల అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, వరంగల్ అదనపు కలెక్టర్‌గా వైవీ గణేశ్, సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్, నిర్మల్ అదనపు కలెక్టర్‌గా బి.వెంకటేశ్వర్లు, వనపర్తి అదనపు కలెక్టర్‌గా కీమ్యా నాయక్ నియమితులయ్యారు.

# 90 రోజుల యాక్షన్ ప్లాన్.. ఇక క్షేత్రస్థాయిలోనే సీఎం, మంత్రులు!

మొదటి పేజీ తరువాయి

ఆ కార్యక్రమానికి ఇంకా పేరు నిర్ధారించలేదు కానీ, వరుసగా 90 రోజుల పాటు వివిధ కార్యక్రమాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రోగ్రామ్ సందర్భంగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. సమస్యలను గుర్తించి, తక్కువ నిధులతో పరిష్కారమయ్యే పనులకు వెంటనే నిధులు మంజూరు చేయనున్నారు.

పరిష్కారానికి ప్రత్యేక వింగ్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా ఒక సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల ప్రజలు, ప్రభుత్వం మధ్య ఉన్న దూరం తొలగిపోనుంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం, తాగునీటి సరఫరా, స్కూల్ రిపేర్లు, అంగన్‌వాడీల్లో వసతులు, విద్యుత్ సమస్యలపై ఫోకస్ పెట్టనున్నారు. వ్యక్తిగత వినతులైన పెన్షన్, రేషన్ కార్డు, ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్ తయారీ

90 రోజుల యాక్షన్ ప్లాన్ కోసం నివేదికలు ఇవ్వాలని అన్ని శాఖల సెక్రెటరీలను ఆదేశించారు. మార్చి మొదటి వారంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీటిని పరిశీలించి షెడ్యూల్‌ను ఖరారు చేయనున్నారు. స్కూల్స్ రీఓపెన్ అయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ కోసం యత్నం

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లేముందు ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తొలగించి, 'ఫీల్ గుడ్ ఫ్యాక్టర్' తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాకాలం తర్వాతే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, 3 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ముందుగానే రైతుభరోసా?

క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభం కాకముందే యాసంగి రైతుభరోసా నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల ప్రజల్లోకి వెళ్లినప్పుడు సానుకూల స్పందన ఉంటుందని, లేనిపక్షంలో నిధుల కోసం ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# భూదాన్ భూమిలో భూబకాసురుల అరాచకం

## మానవత్వం లేని రేవంత్ సర్కార్
## కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కూల్చిన చోటే
## మా ప్రభుత్వం వచ్చాక ఇండ్లు కట్టించే బాధ్యత మాదే
## కేటీఆర్ బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మం వెలుగుమట్ల లో వందలాది పేదల ఇండ్లను కూల్చేసిన కాంగ్రెస్ సర్కార్, బాధితులకు అండగా నిలిచి, ధైర్యం చెప్పిన బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి పువ్వాడ కాంగ్రెస్ కూల్చివేతల పై శాసనసభ నుంచి సుప్రీంకోర్టు వరకు పోరాటం చేస్తాం. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చడమే నా?పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా మెడలు పట్టి గెంటేస్తారా? అర్ధరాత్రి అరాచకం. నోటీసులు లేకుండా కూల్చివేతలా? ఖమ్మం బాధితుల కన్నీటి గాథ.ఖమ్మం వెలుగుమట్లలో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన ఇళ్ల కూల్చివేత బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించిన సమయంలో హృదయవిదారక దృశ్యాలు కనిపించాయి. బాధితులు తమ కన్నీళ్లను ఆపుకుంటూ, తమ వద్ద ఉన్న భూమి పట్టా కాగితాలు, ప్రభుత్వానికి కట్టిన ఆస్తి పన్ను (ప్రాపర్టీ టాక్స్) రశీదులు, ఇంటి పన్ను కాగితాలు మరియు విద్యుత్ కనెక్షన్ కోసం కట్టిన డీ.డీ ల ను కేటీఆర్ కి చూపించారు. అన్నా, ఇవన్నీ ప్రభుత్వమే ఇచ్చిన కాగితాలు కదా, మరి మా ఇళ్లను ఎలా కూలుస్తారు?" అంటూ వారు తమ ఆవేదనను వెళ్లగక్కారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జీవోల ప్రకారం దరఖాస్తు చేసుకుని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నివసిస్తున్న తమను, ప్రస్తుత ప్రభుత్వం అర్ధరాత్రి వేళ దౌర్జన్యంగా ఖాళీ చేయించిందని వారు వాపోయారు.

ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ ఆగ్రహం: బాధితుల వద్ద ఉన్న అన్ని రకాల ధృవీకరణ పత్రాలను పరిశీలించిన కేటీఆర్ గారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సిన "ఇందిరమ్మ రాజ్యం"లో, ఉన్న ఇళ్లను కూలగొట్టడం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలు, భూదాన్ బోర్డు పత్రాలు మరియు కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, కనీస నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ధ్వంసం చేయడం అమానుషమని ఆయన విమర్శించారు. ఖమ్మంలో 150 ఇళ్లతో పాటు, మహబూబ్ నగర్ లో దివ్యాంగుల ఇళ్లను కూడా కూల్చివేయడం ఈ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కేవలం ఆర్డీవో ను బదిలీ చేస్తే సరిపోదని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. బాధితులకు భరోసా మరియు పునరావాస హామీ కూల్చివేతకు గురైన కుటుంబాలకు కేటీఆర్ అండగా నిలిచారు.

"మీరు ఎవరూ అధైర్యపడకండి, ఏడవకండి. మన ప్రభుత్వం వచ్చాక మీ అందరికీ మళ్ళీ ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి, గృహప్రవేశాలు చేయించే బాధ్యత నాది అని, ఆయన హామీ ఇచ్చారు. ఈ పోరాటంలో భాగంగా కలెక్టర్ మరియు చీఫ్ సెక్రటరీలను కలిసి బాధితుల పక్షాన నిలబడతామని చెప్పారు. శాసనసభ, శాసనమండలి వేదికలుగా ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పేదల పక్షాన పోరాడాలని కేసీఆర్ ప్రత్యేకంగా చెప్పారని, బాధితులు ఐకమత్యంగా ఉండాలని ఆయన కోరారు.

న్యాయ పోరాటంపై స్పష్టత: ప్రభుత్వం బాధితులను విడదీసే ప్రయత్నం చేస్తుందని, కానీ అందరూ కలిసికట్టుగా ఉంటేనే విజయం సాధించగలమని కేటీఆర్ సూచించారు. కలెక్టర్ తమతో అబద్ధాలు చెప్పారని బాధిత మహిళలు ఫిర్యాదు చేయగా, అధికారులు మరియు ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగడతామని ఆయన భరోసా ఇచ్చారు. చట్టపరమైన అన్ని ఆధారాలు బాధితుల వైపు ఉన్నాయని, కాబట్టి భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ గారు వారికి ధైర్యాన్ని నూరిపోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాతా మధు మరియు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, లింగాల కమల్ రాజ్, మాజీ మంత్రులు కార్పొరేటర్ లు, బి.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్-అలైవ్ కార్యక్రమం చేపట్టిన సూర్యపేట పట్టణ పోలీసులు




సూర్యాపేట, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నర్సింహా ఆదేశాల మేరకు, అరైవ్బిఅలైవ్ కాంపెయిన్ –2026 ప్రోగ్రామ్ లో భాగముగా అనగా తేదీ 24.02.2026 రోజున మధ్యానము సమయమున సూర్యాపేట పట్టణములోని ఏ వి ఎం హై స్కూల్ నందు పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకట్ , సూర్యాపేట 2 వ పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ శివ తేజ్ ల సమక్షములో "అర్రివ్ –ఆలీవ్ కాంపెయిన్ – 2026 ప్రోగ్రాం కండక్ట్ చేయటము జరిగినది. ఇట్టి ప్రోగ్రాం కు ముఖ్య అతిదిగా సూర్యాపేట డీస్పీ వి.ప్రసన్నకుమార్ హాజరు అయినారు. సూర్యాపేట డీస్పీ వి . ప్రసన్నకుమార్ ఇట్టి ప్రోగ్రామ్ లో భాగముగా, విధ్యార్థులకు రోడ్ సేఫ్టీ గురించి, నెంబర్ ప్లేట్ టాంపరింగ్, వెహికల్ మోడిఫికేషన్, సీట్ బెల్ట్ గురించి, హెల్మెట్ యొక్క ప్రాముక్యత, మధ్యము సేవించి వాహనాలు నడిపినచో, జరిగే ప్రమాదాల గురించి, ఓవర్ లోడ్ గురించి అలాగే వాహనాలను ఎంవీఐ తనిఖీ చేయించుకునే ప్రాముక్యత గురించి పూర్తి సమాచారమును తెలియపరచనైనది. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటయ్య మరియు ఎస్సై శివతేజ తదితరులు పాల్గొన్నారు.

# నవ వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



జాఫర్ఘడ్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఉప్పుగల్ గ్రామం బీఆర్ఎస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి రజిత –రాజిరెడ్డి ప్రధమ కుమారుడు సొంటిరెడ్డి శివారెడ్డి–ప్రశాంతి రెడ్డి వివాహ వేడుక దామెర మండలం, ఊరుగొండ లో ఘనంగా జరిగింది.ఈ శుభకార్యానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ రాజయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి,సుఖశాంతులతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు కూడా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# రాష్ట్రంలోనే ఐదు బహుమతులు సాధించిన ధర్మసాగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కే. కేతన




ధర్మసాగర్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హనుమకొండజిల్లా ధర్మసాగర్ మండలం ధర్మసాగర్ గ్రామంలోని పిఎంశ్రీ జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రతిభ కనబరిచి కే.కేతన ఐదు బహుమతులు సాధించింది. హైదరాబాద్లో నిర్వహించిన సిడబ్ల్యూఎస్ఎన్ రాష్ట్రస్థాయి క్రీడలలో పోటీలలో పాల్గొని రన్నింగ్,లాంగ్ జంప్, చెస్,షాట్పుట్,జిగ్జాగ్ పరుగులు వంటి మొత్తం ఐదు ఈవెంట్లలో విజయం సాధించింది. హనుమకొండ జిల్లా తరఫున పాల్గొన్న కె.కేతన రాష్ట్రస్థాయిలో అత్యధిక బహుమతులు సాధించడం విశేషం. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.మురళి,స్పెషల్ ఎడ్యుకేటర్ పి.సరస్వతి,ఎంఈవో బి.రాంధన్ విద్యార్థిని ని అభినందించారు.జిల్లా విద్యాశాఖాధికారి సైతం కేతన ప్రతిభనుకొనియాడుతూ,ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినికి ప్రత్యేక, అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

# జనగామ జిల్లా నూతన కలెక్టర్గా సందీప్ కుమార్ ఝూ బాధ్యతల స్వీకరణ



జనగామ, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జనగామ జిల్లా కలెక్టర్గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్గా పనిచేస్తున్న 2014 కేడర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ ఝూ ను జనగామ జిల్లా నూతన కలెక్టర్గా నియమించారు. గురువారం మధ్యాహ్నం సందీప్ కుమార్ ఝూ జనగామ జిల్లా కలెక్టర్గా బాధ్యతలను స్వీకరించారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

# కోటంచలో వాసవి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





భూపాలపల్లి, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కోటంచ గ్రామంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో వాసవి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ఘనంగా ప్రారంభించబడింది.ఈ సేవా కార్యక్రమాన్ని గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.సత్రం గౌరవ అధ్యక్షుడు ఎర్రం సదాశివ శంకర్, అధ్యక్షుడు కాసం నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా సత్రం అధ్యక్షుడు కాసం నాగరాజు మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా ఆర్యవైశ్య సమాజం తరఫున ఈ నిత్యాన్న సత్రాన్ని స్థాపించామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి లక్ష్మీనరసింహ స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు, ఆర్యవైశ్య కుల బంధువులకు ఉచిత భోజన వసతి కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఇతర దేవస్థానాలలో విజయవంతంగా కొనసాగుతున్న వైశ్య నిత్యాన్న సత్రాల మాదిరిగానే కోటంచ దేవస్థాన పరిధిలో కూడా శాశ్వతంగా సేవలు అందించాలనే సంకల్పంతో ఈ సత్రాన్ని నెలకొల్పినట్లు వివరించారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, భక్తులకు ఆహార వసతి అందించడం అత్యంత పుణ్యకార్యమని, సమాజ సేవా భావంతో ముందుకొచ్చిన నిర్వాహకులను అభినందించారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.సత్రం సక్రమంగా కొనసాగేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాను కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోటంచ దేవాలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్ రావు, భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కోటంచ సర్పంచ్ చవాటి మొగిలి తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.పరిసర మండలాల నుండి వచ్చిన ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సత్రం ప్రారంభోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు.భవిష్యత్తులో కూడా నిరంతరంగా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని నిర్వాహకులు సంకల్పం వ్యక్తం చేశారు.కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల ఆశీస్సులతో ఘనంగా ముగిసింది.


# వెలుగుమట్ల భూదాన భూములలో ని పేదల ఇళ్ళు కూల్చివేతను ఖండించండి

### జాజిరి శ్రీనివాస్ (సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు)



సత్తుపల్లి, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన భూముల్లో పేదల గుడిసెల కూల్చివేతను సిపిఐ (ఎం ) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. పదేళ్లుగా అక్కడే నివసిస్తూ జీవనం సాగిస్తున్న వందలాది పేద కుటుంబాల ఇళ్లను భారీ పోలీసు బలగాలతో కూల్చివేయడం అమానుషమని పేర్కొన్నారు. నివాస హక్కు ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని, ఆ హక్కును రక్షించాల్సిన ప్రభుత్వం పేదలను రోడ్డున పడేయడం అన్యాయమని విమర్శించారు. పేదల ఇళ్ళు కూలగొట్టి ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని మంత్రి వింత ప్రకటన విడ్డూరంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదలకు గూడు లేకుండా చేయడమేనా? అని ప్రశ్నించారు. కూల్చిన ప్రతి ఇంటిని తిరిగి నిర్మించి ప్రజలకు అప్పజెప్పాలన్నారు. నిరాశ్రయులను చేసిన ప్రజలకు ప్రత్యామ్నాయ నివాస వసతి తక్షణమే కల్పించాలన్నారు. ధ్వంసం చేసిన ప్రజల సామాగ్రికి పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జనసేన పార్టీకీ కార్యకర్తలే బలం - ఉపేంద్ర



తల్లాడ, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జనసేన పార్టీ చేపట్టబోయే ఐదో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ విజయవంతం చేయాలని ఆ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు దేవల్ల ఉపేంద్ర కోరారు.గురువారం తల్లాడ మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జనసేన సభ్యత్వం తీసుకున్నవారు రెన్యువల్ చేయించుకోవాలని, కొత్తగా సభ్యత్వం తీసుకోవాలనుకునేవారికి ఇదోక మంచి అవకా శమన్నారు. ఈ సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలు పార్టీ సభ్యునిగా గుర్తింపు గౌరవం, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత, పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి, సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే నాయకత్వ బాధ్యతలు, నాయకత్వ ట్రైనింగ్, నాయకులుగా ఎదిగే అవకాశాలు, 5లక్షల ప్రమాద బీమా ద్వారా మీ కుటుంబానికి భరోసా. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ఏన్కూర్ మండలం తూతక్క లింగన్నపేట గ్రామానికి చెందిన కార్యకర్త పసుపులేటి కృష్ణ కుటుంబానికి ప్రమాద భీమా కింద 5 లక్షల రూపాయలు అందజేసినట్లు గుర్తుచేశారు. కార్యకర్తల చేయూతనిచ్చే ఏకైక పార్టీ జనసేన అన్నారు.కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

# ఏపీ అసెంబ్లీలో తెలంగాణ రాజకీయంపై రగడ.. ఇక్కడ క్రెడిట్ వార్ అక్కడ వర్సెస్ బ్లేమ్ వార్



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాజయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుపై ఏపీ అసెంబ్లీ దద్దరిల్లిపోయింది. రాయలసీమ ప్రాజెక్టు పనుల నిలుపుదల క్రెడిట్ తమదంటే తమదే అని గతంలో తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై తాజాగా ఏపీ శాసనమండలిలో రీసౌండ్ వచ్చింది. రేవంత్ సర్కార్‌తో చంద్రబాబు లాలూజీ పడ్డారని మండలిలో వైసీపీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేయగా దీనికి మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ గత వైసీపీ చేతగాని దద్దమ్మ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టుపెట్టిందంటూ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. దీంతో తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చల అంశంపై ఇప్పుడు ఏపీ శాసనమండలిలో వైసీపీ, టీడీపీ మధ్య మాటల యుద్ధం సాగడం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

మీరు ద్రోహులు.. మీరే దద్దమ్మలు:

రాయయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి నేనే నిలిపి వేయించానని తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని మండలిలో బొత్సా సత్యనారాయణ, ఆ పార్టీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి అధికార పక్షాన్ని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం సీఎం మన రాష్ట్ర సీఎం పేరు చెప్పి ఈ ప్రాజెక్టును అడ్డుకున్నారని చెబుతుంటే ఇది వాస్తవం కాదని మంత్రి వర్గం, సీఎం ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు క్లారిటీగా చెప్పడం లేదని రాయలసీమకు ద్రోహం జరుగుతంటే చూస్తూ కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికార పక్షం ధ్వంద్వ వైఖరి బయటపడుతోందన్నారు. బొత్సా వ్యాఖ్యలకు అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు మత్రి పయ్యావుల కేశవ్. నాటి చేతగాని, దద్ధమ్మ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని వైసీపీపై మండిపడ్డారు. వైసీపీ హయాంలోనే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందని తాము చెప్తే జగన్ ఆపారని హరీశ్ రావు అసెంబ్లీలోనే చెబితే దానికి మేము సమాధానం చెప్పాలా అని మండిపడ్డారు. మంత్రి నిమ్మల రామనాయుడు మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం కాదు.. తాగునీటి కోసమని వైసీపీ ప్రభుత్వం 2023 ఆగస్ట్ 18న జీవో నంబర్ 364 సహా అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ వైసీపీ నిరసన వ్యక్తం చేయడంతో సభ పలు మార్లు వాయిదా పడింది.

ఇక్కడ క్రెడిట్ వార్ అక్కడ బ్లేమ్ వార్:

రాయలసీమ ప్రాజెక్టు విషయంలో రెండు రాష్ట్రాల మధ్య సాగుతున్న రాజకీయం ఆసక్తిని రేపుతోంది. రాయలసీమ పనులు ఆపామంటూ తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య క్రెడిట్ వార్ సాగగా ఇవే పనులు అపడం వెనుక మేమంటే మేము లేమని ఏపీలోని వైసీపీ, టీడీపీ మధ్య బ్లేమ్ వార్ రాజకీయం సాగింది. కాగా గత జనవరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపించాను. రెండు రాష్ట్రాల మధ్య మంచి వాతావరణం ఉండాలని నేను సాధించిన విజయాన్ని ఇంత వరకు చెప్పుకోలేదు. రాయలసీమ ప్రాజెక్టును ఆపితేనే మేము మీతో ఏదైనా విషయాలపై చర్చకు వస్తామని సూటిగా చంద్రబాబు నాయుడుకు నేను క్లోస్డ్ రూమ్‌లో విజ్ఞప్తి చేస్తే మా మీద ఉన్న గౌరవంతో ఆపేశారని చెప్పారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆ తర్వాత తెలంగాణ భవన్ లో మాట్లాడిన హరీశ్ రావు రాయలసీమను ఆపింది మేమే అని స్పష్టం చేశారు. రాయలసీమ ప్రాజెక్టు జీవో 2020, మే 5న వచ్చిందని, దానికి ఆరు నెలల ముందే ఆ ప్రాజెక్టును తెలంగాణ అంగీకరించబోదని, అది చట్టవిరుద్ధమని, తక్షణం ఆపాలని కేంద్రానికి, కేఆర్ఎంబీకి లేఖల ద్వారా కేసీఆర్ ఫిర్యాదు చేశారని అన్నారు. నెల క్రితం తెలంగాణలో రాజయ వేడి రాజేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో ఫైర్ అవుతున్నాయి.

## లిక్కర్ కేసులో అవినాష్ రెడ్డికి రిమాండ్.. రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు!



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన లిక్కర్ కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాష్ రెడ్డికు ఏసీబీ కోర్టు విజయవాడ రేపటిదాకా రిమాండ్ విధించింది. ఈ కేసులో ఊ7 నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇతర నిందితుల రిమాండ్ గడువు కూడా ముగియనున్న నేపథ్యంలో అందరినీ కలిపి నేడు మళ్లీ కోర్టులో హాజరు పరచనున్నారు.

లిక్కర్ స్కాం కేసులో భాగంగా అవినాష్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు విజయవాడలోని కార్యాలయంలో సుమారు ఐదు గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తరువాత కోర్టులో హాజరు పరిచారు. ముందస్తు బెయిల్ కోసం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించినా, రెండు చోట్లా పిటిషన్లు తిరస్కరించబడటంతో అవినాష్ రెడ్డి సిట్ అధికారుల ఎదుట లొంగిపోయారు.

రిమాండ్ రిపోర్ట్ ప్రకారం.. ఈ లిక్కర్ కుంభకోణంలో అవినాష్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన నిందితుడు ఏ1 కేసిరెడ్డితో కలిసి కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. మద్యం సిండికేట్‌ను ఏర్పాటు చేసి, కిక్‌బ్యాక్‌లు, కమీషన్ల ద్వారా అక్రమంగా భారీ ఆర్థిక లాభాలు పొందినట్లు రిపోర్ట్‌లో పేర్కొన్నారు. మద్యం సిండికేట్ కార్యకలాపాల్లో అవినాష్ రెడ్డి ప్రధాన వ్యూహకర్తగా, ఆర్థిక నియంత్రణ దారుడిగా వ్యవహరించినట్లు సిట్ అధికారులు తెలిపారు.


పాత బ్రాండ్లను మార్కెట్ నుంచి తొలగించి, తమకు అనుకూలంగా కమిషన్లు ఇచ్చే బ్రాండ్లను మాత్రమే కొనుగోలు చేసేలా నిర్ణయాలు తీసుకున్నట్లు విచారణలో తేలింది. అక్రమంగా సంపాదించిన డబ్బును వ్యక్తిగత ఖర్చులతో పాటు ఆస్తుల కొనుగోలుకు వినియోగించినట్లు కూడా రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసిన అధికారులు, ఇంకా విచారణ కొనసాగిస్తున్నారు. అవినాష్ రెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం. రేపు కోర్టులో మరోసారి హాజరు పరచనున్న నేపథ్యంలో ఈ కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశముంది.

## గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ఫోకస్.. అమరావతిలో కీలక భేటీ



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గోదావరి పుష్కరాల ను వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి నుంచి పుష్కరణాల నిర్వహణపై ఫోకస్ పెట్టింది. మహా కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత అనుభవాలు రిపీట్ కాకుండా పటిష్టంగా సిద్ధాంత పరంగా నిర్వహించేందుకు కసరత్తులు ప్రారంభించింది. వచ్చే ఏడాది జూన్‌లో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే గోదావరి పుష్కరాల బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. దీంతో తాజాగా అమరావతిలో కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం కొనసాగుతోంది. మంత్రులు కందుల దుర్గేష్, బి.సి. జనార్ధన్, సత్యకుమార్, గొట్టిపాటి, మండిపల్లితో పాటు ఉన్నతాధికారులు హాజరై చర్చిస్తున్నారు. పుష్కరాలు ఘనంగా జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. మహా కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత చోటు చేసుకుంది.

## పేదరికంలేని రాజ్యాలను సృష్టిస్తే నక్సలైట్లురారు : సీపీఐ నారాయణ



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పేదరికం లేని రాజ్యాలను సృష్టిస్తే నక్సలైట్లు రారని సీపీఐ నారాయణ అన్నారు. ఆపరేషన్ కగార్, నక్సలైట్ల లొంగుబాటుపై ఆయన స్పందించారు. దోపిడీదారులు ఉన్నంతకాలం ఉద్యమాలు జరుగుతూనే ఉంటాయన్నారు. సమాజంలో ఏదో ఓ రూపంలో తిరుగుబాటు జరుగుతుందని సీపీఐ నారాయణ వ్యాఖ్యానించారు. చెట్టుకొట్టేస్తే మళ్లీ మొలకలు వస్తాయన్నారు. నక్సలైట్లను చంపినంత మాత్రాన ఉద్యమం ఆగిపోతోందనుకోవడం పొరపాటేనని చెప్పారు. అన్యవర్గ ధోరణులు, అరాచకాలు, దోపిడీ విధానం ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయని సీపీఐ నారాయణ తెలిపారు.

## డయేరియాపై ఆందోళన వద్దు.. వైసీపీ శవ రాజకీయాలు చేస్తోంది : కేంద్రమంత్రి



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మూడురోజుల క్రితం శ్రీకాకుళంలో డయేరియా ప్రబలిన విషయం తెలిసిందే. తాగునీరు కలుషితం కావడంతో.. సుమారు 74 మంది ప్రజలు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలయ్యారు. గురువారం ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. అతిసార వ్యాధితో మరణించిన సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేతో సమావేశమై.. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రీకాకుళం ప్రాంతంలో డయేరియా కేసులు పెరగడంతో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టిందని కేంద్రమంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ తీసుకుంటున్నవారు కూడా కోలుకుంటున్నారని పేర్కొన్నారు. డయేరియా ప్రస్తుతం కంట్రోల్లోకి వచ్చిందని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. అలాగే ప్రభావిత ప్రాంతాలతో పాటు.. శ్రీకాకుళమంతా మెరుగైన తాగునీటి సదుపాయాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు భరోసా ఇచ్చారు. శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రి కల్తీపాట ఘటనలో మొత్తంగా ఆరుగురు మరణించగా.. పరిస్థితులను అర్థం చేసుకోకుండా వైసీపీ నాయకులకు శవాలతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారింది విమర్శించారు.

## రాష్ట్ర మున్సిపల్ శాఖ కీలక ఆదేశాలు

ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాష్ట్రంలో కల్తీ పాల ఘటన, కలుషిత నీరు తాగి ఇటీవల జరిగిన ఘటన దృష్ట్యా అధికారులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని మున్సిపాలిటీల్లో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే సురక్షిత నీటినే ప్రజలకు అందించేలా చూడాలి ఎస్‌వోపీ జారీ చేసింది. మున్సిపాలిటీల్లో తాగునీరు కలుషితం అయిన ఘటనలు చోటు చేసుకుంటే అది కమిషనర్లదే బాధ్యత అని, అసలు ఉపేక్షించేది లేదని ఆదేశించింది. రాష్ట్రవ్యాపంగా అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి పైప్‌లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కమిషనర్లను ఆదేశాలు జారీ చేసింది. తాగునీటి పైప్‌లైన్లు డ్రైనేజీల ద్వారా వెళ్తే వెంటనే మార్చాలని సూచించింది. అలాగే డ్రైనేజీల్లో నీరు నిల్వ లేకుండా వెంటనే డీసిల్టేషన్ చేయాలని తెలిపింది. తాగునీటిపై ఫిర్యాదులు, సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలా చూడాలని కమిషన్లను మున్సిపల్ శాఖ ఆదేశించింది.

## నేను ఆత్మహత్య చేసుకుంటా.. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు



ఏపీ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై బాధితురాలు వరుస వీడియోలు రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే రోజుకో వీడియో వదిలిన వీణ తాజాగా మరో వీడియోను రిలీజ్ చేసింది. వీడియోలో ఆమె మాట్లాడుతూ.. తాను బయటకు వచ్చి నెల రోజులు అవుతోందని చెప్పింది. ఈ నెల రోజులలో తనకు ఏం న్యాయం జరిగిందని ప్రశ్నించింది. జనసేన కమిటీ వేసిందని ఆ కమిటీ ఎలాంటి రిపోర్ట్ ఇవ్వలేదన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైందని, తనపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగింది అని బయటకు వస్తే ఒక్కడు కూడా ముందుకు రావడంలేదా అని మండిపడ్డారు. అంటే అన్యాయం జరినట్టేనా అని ప్రశ్నించారు.

అధికారపార్టీ అనే పట్టించుకోవడంలేదా అని అన్నారు. పార్టీకి సంబంధం లేదు అంటున్నారు..పార్టీ అధికారం ఇవ్వడం వల్లే శ్రీధర్ ఎమ్మెల్యే అయ్యాడని తెలిపింది. శ్రీధర్ సర్పంచ్ గా ఉన్నప్పుడు అసలు ఎవరో కూడా తెలియదు అని చెప్పింది. శ్రీధర్ ఇచ్చిన ధైర్యంతో ఎంత దారుణం చేసినా తాను నమ్మానని ఆవేదన వ్యక్తం చేసింది. పల్లెటూరులో పుట్టినవాడు అన్యాయం చేయడు కదా అని నమ్మి మోసపోయానని తెలిపింది. ప్రభుత్వంపై నమ్మకంతో తాను బయటకు వచ్చానని అలా వస్తే హనీట్రాప్, రాజకీయ కుట్ర అంటూ ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. కాళ్లు పట్టుకుని అడిగినా నెలరోజుల నుండి ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పింది.


అధికారంలో ఉన్నవాళ్లు న్యాయం చేయపోతే ప్రతిపక్షం సాయం కోరడంలో తప్పేంటని ప్రశ్నించింది. పోలీస్ వ్యవస్థ, అధికారంలో ఉన్నవాళ్లు ఏం న్యాయం చేశారని ప్రశ్నించింది. తప్పు చేసిన శ్రీధర్ ఊర్లో క్రికెట్ ఆడుకుంటున్నాడని.. తాను మాత్రం ఒంటరి అయ్యానని ఆవేదన వ్యక్తం చేసింది. తప్పు చేసిన వాళ్లనే ఎంకరేజ్ చేస్తారా అంటూ పవన్ కల్యాణ్ ను ప్రశ్నించింది. నెల రోజుల నుండి తన వెంట ఎవరూ లేరని ఒంటరిగానే తిరుగుతున్నానని చెప్పింది. అధికార పార్టీ మహిళలకు తోడు ఉందని నిరూపించుకోవాలని చెప్పింది. దయచేసి పవన్ కల్యాణ్ తనకు న్యాయం చేయాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేసింది.

# అటవీ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం



ములుగు, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏటూరునాగారం మండలం పెద్దవేంకటాపురం గ్రామ లో అటవీ అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అటవీ శాఖ సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో అటవీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవుల్లో ఎండకాలంలో నిర్లక్ష్యంగా మంటలు వేయడం, పొలాల్లో మిగులు అవశేషాలను దహనం చేయడం వల్ల పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా బీడి, సిగరెట్ ముక్కలు వేయడం, చెత్తను కాల్చడం వంటి చర్యలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన సందేశాలతో బ్యానర్ ప్రదర్శించారు. అటవీ సంపదను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా కార్యక్రమానికి సహకరించి, అడవులను రక్షించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు డిఆర్ఓ నారాయణ బిట్ ఆఫీసర్ చెప్పి రాజేష్ అనూష మరియు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# గండిపెల్లి ప్రాజెక్టుతోనే అక్కన్నపేట మండల రైతాంగానికి ఎక్కువ మేలు



అక్కన్నపేట, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే లక్ష్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం జల యజ్ఞంలో భాగంగా చేపట్టడం జరిగింది నాడు ఈప్రాంతానికి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న చాడ వెంకటరెడ్డి గౌరవెల్లి, గండిపల్లి,తోటపల్లి రిజర్వాయర్, నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి డా" వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చేత (2007)లో శంకుస్థాపన చేయించడం జరిగిందని అప్పటి నుండి గండిపెల్లి, గౌరవెల్లి సత్వరపూర్తికై అనేక విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వాలు భూసేకరణ చేయడానికి, ప్రాజెక్టుల నిర్మాణానికి విడతల వారిగా అరకొర నిధులు కేటాయించడంతో అవి పూర్తి కాలేదని సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి గురువారం నాడు ముఖ్యమంత్రి ఎనుముల రెవంత్ రెడ్డికి లేఖ రాశారు గత ప్రభుత్వాల హయాంలోనే గండిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ జరిగినప్పటికీ నిధులు కేటాయించనందు వలన నలపై శాతం మాత్రమే పనులు పూర్తి కాబడింది గండిపల్లి రిజర్వాయర్ ద్వారానే అక్కన్నపేట మండలంలోని ఎక్కువ గ్రామాలకు దాదాపు పాదనాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందని గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులు, న్యాయ పరమైన చిక్కులు,భూసేకరణ లంటి వాటిపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కూమార్ రెడ్డి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష చేసి ప్రాజెక్టు పనుల పురోగతికి ముందడుగు వేయడం శుభసూచికం కాని అట్టి సమావేశంలో చాలా కాలంగా గండిపల్లి రిజర్వాయర్ ప్రస్తావన లేకపోవడం బాధాకరంగా ఉందిని చాడ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇట్టి ప్రాజెక్టు పూర్తికి ఇప్పటికే ఆరు వందల అరవై ఎకరాలకు గాను మూడువందల ఎకరాల భూమిని సేకరించబడిందని మిగతా భూమిని సేకరించాల్సివుందని గండిపల్లి ప్రాజెక్టు ద్వారా మాత్రమే శ్రీరాంసాగర్ వరద కాలువ పూర్తి లక్ష్యం నెరవేరుతుందని ఇప్పటి వరకు పనులు చేపట్టిన గండిపల్లి రిజర్వాయర్ ఏజెన్సీ ద్వారా పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టవల్సివుందని సిఎం కు రాసిన లేఖలో పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు తో పాటు గండపల్లి రిజర్వాయర్ పూర్తి చేయడానికి ప్రత్యేకంగా వంద కోట్ల నిధులు మంజూరి చేసి యుద్ధ ప్రాతిపదికన రిజర్వాయర్ను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రెవంత్ రెడ్డిని కోరుతూ రాష్ట్ర మంత్రులు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిసి సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్, శ్రీరాం సాగర్ చీఫ్ ఇంజనీర్ లకు చాడ వెంకటరెడ్డి లేఖలు రాశారు.

# వికారాబాద్ జిల్లా కలెక్టర్ బదిలీ

## కొత్త కలెక్టర్‌గా దీపక్ తివారి నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



వికారాబాద్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా దీపక్ తివారి నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా 45 మంది ఐఏఎస్ అధికారులకు స్థాన చలనం కల్పించారు. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను నారయణపేట్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా కలెక్టర్‌గా ఆసిఫబాద్ జిల్లా అనదపు కలెక్టర్‌గా ఉన్న దీపక్ తివారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# చిన్నారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**ఎమ్మార్పీఎస్ నవాబుపేట్ మండల అధ్యక్షుడు దాసరి సుధాకర్ మాదిగ**



వికారాబాద్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నాగర్ కర్నూల్ మండల పరిధిలో జరిగిన కుమ్మెర గ్రామం మల్లన్న జాతరలో దైవ దర్శనానికి వెళ్లిన కుటుంబానికి చెందిన చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకొని దాడికి పాల్పడి పసిపాప మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నవపేట్ మండల అధ్యక్షులు దాసరి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు ఈ ఘటనలో పాలుపంచుకున్న వారిపై హత్య కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు రాష్ట్రంలో కుల దుహంకార హత్యలు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే రాజీపడకుండా కఠినంగా శిక్షించాలని తెలిపారు

# ఇళ్లను కూల్చివేయడానికి వ్యతిరేకంగా బిజెపి నిరసన కార్యక్రమం



కుత్బుల్లాపూర్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడానికి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన పోరాటం బిజెపి నిరసనలు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కోసం లంగర్ హౌస్, బాపు ఘాట్ సమీపంలోని పేదలు, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్. రామచందర్ రావు, బాధితుల పక్షాన నిలిచి, వారి ఇళ్లను కూల్చడానికి అనుమతించబోమని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్ రెడ్డి, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, సినియర్ నాయకులు నరేష్ గౌడ్, ఇతర బీజేపీ శ్రేణులు. ఈ పాదయాత్ర ఆందోళనల ద్వారా మూసీ పరివాహక ప్రాంత బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# పాత కాంగ్రెస్ పాతర కొత్త కొత్త వాళ్ళ జాతర

## పనిచేసిన కార్యకర్తలను పక్కన పడేసి పైరవీ కారుల రాజ్యం.

## సాదు యాదవ్



కుత్బుల్లాపూర్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బిఆర్ఎస్ తో పోరాడిన వారికి వీధిపాలు అవమానాలు. డబ్బు కులం లాబీయింగ్ తో కొత్త వాళ్ళ హవా. త్యాగాలు మరిచి అహంకారం పార్టీకి మళ్లీ అపజయమే అంటున్న కార్యకర్తలు. ఏ పార్టీలో అయినా పని చేసిన వారు పరాయివారేనా కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో కంటికి రెప్పలాగా కష్టకాలంలో పార్టీని కాపాడిన పాత కార్యకర్తలు సామాజికవేతలు నాయకులను పూర్తిగా పక్కన పెట్టేశారు కార్యకర్తల కష్టం మీదనే నేటి నాయకులు అధికార పదవులు హోదా దర్పణం అనుభవిస్తున్నారు నాడు చెమటోడ్చి రక్తం చిందించి కేసులు ఎదుర్కొని పార్టీని కాపాడిన వారు నేడు చెరివి వేయబడ్డారు పార్టీ కోసం అయినవాళ్లను కూడా వదులుకొని నాలాంటి వాళ్ళు ఎంతోమంది కుటుంబాలకు దూరమయ్యారు పార్టీ జెండా పట్టుకొని రోడ్లపై తిరిగిన వారికి ఇప్పుడు ఒక్క పదవి ఒక గౌరవం కూడా దక్కలేదు వారు ఇప్పుడు వీధుల్లో తిరుగుతున్నారు పార్టీ కార్యక్రమాలలో కూడా చూడని స్థితి పార్టీ కోసం పని చేసిన క్రమంలో ఎన్ని అవమానాలు బెదిరింపులు ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వారు వెనుకడుగు వేయలేదు ఇతర పార్టీల నుంచి వచ్చే బహుమానాలకు ఆఫర్లకు ఎన్నడూ లొంగలేదు కేవలం కాంగ్రెస్ పార్టీ కోసం నమ్ముకున్న నాయకుని కోసం రేవంత్ రెడ్డి నాయకత్వం కోసం మాత్రమే నిలబడ్డారు చిరిగిన చొక్కా తొడిగి ఖాళీ జేబులు తో కూడా కాంగ్రెస్ కండువాలను జండాలను పదిలంగా కాపాడుకున్నారు కానీ నేడు పార్టీ కోసం కష్టపడ్డ వారిని పక్కన పెట్టి కొత్త కొత్త వాళ్లను నేడు తెరమీదకు తీసుకొస్తున్నారు కాంగ్రెస్ ను సర్వనాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం నిలబడ్డ వారికి నేడు గుర్తింపు లేకుండా పోయింది. బి ఆర్ ఎస్ నాయకులు ఇబ్బందులు పెట్టినప్పుడు కూడా సామాన్య కార్యకర్తలు ఒంటరిగా నిలబడి రేవంత్ రెడ్డి, నాయకత్వం కోసం పోరాడారు కానీ అధికారం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది పాత కార్యకర్తలను కనుచూపు మేరలో కూడా చూడడం లేదు పార్టీ కోసం పనిచేసిన నాయకులు గానీ కార్యకర్తల గాని ఏ ఒక్క నామినేట్ పదవి దక్కలేదు ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారు వారి హవా కొనసాగిస్తున్నారు ఎక్కడ చూసినా వారి హడావిడి మాత్రమే కనిపిస్తుంది పాత చెప్పుల కన్నా కొత్త కొమ్ములకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు డబ్బు ఉంటే కులం ఉంటే లాబీయింగ్ ఉంటే మాత్రమే అవకాశాలు దక్కుతున్నాయి పరిస్థితి ఇలానే ఉంటే వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ పరాజయం చెందడం ఖాయమని నాయకులు కార్యకర్తలు అంటున్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే సీఐ.కిషన్







కాజీపేట, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హనుమకొండజిల్లా కాజీపేట మండలంలోని మడికొండ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ పుల్లాల కిషన్ ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పుల్లాల కిషన్ మాట్లాడుతూ,మద్యంతాగి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం,ఆస్తినష్టం జరుగుతాయని తెలిపారు.అలాంటి నిర్లక్ష్య చర్యలు కుటుంబాలకు విషాదాన్ని మిగులుస్తాయని ఆయన అన్నారు.మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని, జరిమానాలు మాత్రమే కాకుండా జైలు శిక్ష కూడా పడే అవకాశముందని చెప్పారు.ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి,సురక్షితంగా ప్రయాణించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సై రాజబాబు,రాజకుమార్ రామ్మోహన్,స్థానిక ప్రజలు,యువత, వాహనదారులు పాల్గొని అవగాహన పొందారు.

# గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

## గీసుగొండ పోలీసులు కఠిన చర్యలు

గీసుకొండ, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండల పరిధిలో గుడుంబా అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి వివరాలు:బాదావత్ విజయకుమార్, తండ్రి: రవి, వయస్సు: 20 సంవత్సరాలు, కులం: ఎస్టీ-లంబాడ, వృత్తి: డెకరేషన్ వర్క్, నివాసం: హరి నాయక్ తండా, చెన్నారావుపేట, వరంగల్; ప్రస్తుతం నివాసం: జానపాక, గొర్రెకుంట.నమ్మదగిన సమాచారం మేరకు జానపాకలో తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నాడని తెలిసి, పోలీసులు దాడి నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 3 లీటర్ల ప్రభుత్వ నిషేధిత గుడుంబాను స్వాధీనం చేసుకొని, పంచుల సమక్షంలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు.ప్రభుత్వం నిషేధించిన గుడుంబా సేవించడం వల్ల ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. అందువల్ల గుడుంబా తయారీ, రవాణా, నిల్వ, విక్రయాలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయి.

# మహిళ అదృశ్యం కేసు నమోదు

## గీసుగొండ పోలీసులు దర్యాప్తు ప్రారంభం

గీసుకొండ, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గీసుగొండ మండల పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై గీసుగొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సి.ఐ తెలిపారు.



అదృశ్యమైన మహిళ వివరాలు:
పేరు: ఆరూరి లక్ష్మి
వయస్సు: 56 సంవత్సరాలు
ఎత్తు: సుమారు 5 అడుగులు
రంగు: చామనచాయ
ఘటన వివరాలు:

ఈ నెల 19-02-2026 తేదీన తన కుమారుడితో మనస్పర్థలు రావడంతో ఆరూరి లక్ష్మి తన తమ్ముడు ఇంటికి మొగిలిచర్లకు వెళ్లింది. 20-02-2026 తేదీన ప్రతిపాకలోని తన కుమార్తె ఇంటికి వెళ్తున్నట్లు తమ్ముడికి చెప్పి అక్కడి నుండి బయలుదేరింది. అయితే ఆమె కుమార్తె ఇంటికి చేరలేదు.

కుటుంబ సభ్యులు అప్పటి నుండి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 26-02-2026 తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సి.ఐ విశ్వేశ్వర్ తెలిపారు.

ఆమె గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వారు వెంటనే గీసుగొండ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవలసిందిగా పోలీసులు కోరుతున్నారు.

# అకాలంగా మరణించిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక భరోసా

## పోలీస్ ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ చెక్కు అందజేసిన

## జిల్లా ఎస్పీ నరసింహ




సూర్యాపేట, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జిల్లా పోలీస్ నందు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో మరణించిన కృష్ణయ్య కుటుంబానికి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నరసింహ ఐపిఎస్. ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ నగదు చెక్కును అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. సిబ్బంది ఆరోగ్యం పై దృష్టి సారించాలి వ్యాయామం చేయాలి, మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి అని కోరారు. సిబ్బంది కుటుంబాలకు ఆరోగ్య భద్రత పథకం బాసట గా నిలుస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్, సంక్షేమ ఆర్ఎస్ఐ సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య క్రాంతి
మన క్రాంతి KR TV
epaper.krtvnews.com

# ఫైబర్ అధికంగా ఉండే పండ్లు ఇవే.. వీటితో మీ జీర్ణవ్యవస్థ పదిలంగా ఉంటుంది




హెల్త్ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శరీరానికి అత్యంత అవసరమైన పోషకాల్లో ఫైబర్ ఒకటి. మొత్తం శరీర ఆరోగ్యానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. మొక్కల ఆధారిత ఫైబర్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, గుండె ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంలో, గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో, మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరానికి ఇతర పోషకాల లాగా ఫైబర్ కూడా చాలా అవసరం. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిక్కుళ్లు, తృణ ధాన్యాలు వంటి వాటిల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అయితే పండ్లను తీసుకోవడం ద్వారా రుచికరంగా, అనుకూలంగా, సులభంగా తగినంత ఫైబర్ ను పొందవచ్చు. కనుక ఫైబర్ ను ఎక్కువగా అందించే వివిధ రకాల పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పాషన్ ఫ్రూట్, పియర్స్..

ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లల్లో పాషన్ ఫ్రూట్ ఒకటి. దీనిలో కరిగే, కరగని రెండు రకాల ఫైబర్ లు ఉంటాయి. దీనిలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ కు మద్దతును ఇస్తుంది. జామకాయలో 100గ్రాములకు గాను 5 నుండి 6 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. దీనిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ప్రేగు కదలికలు మెరుగుపడతాయి. పియర్స్ కూడా కరిగే, కరగని రెండు రకాల ఫైబర్ ను కలిగి ఉంటాయి. ఈ పండ్లు ఎక్కువగా వాటిపై తొక్కలో ఫైబర్ ను కలిగి ఉంటాయి. అధిక ఫైబర్ ను పొందాలంటే ఈ పండ్లను తొక్కతో సహా తీసుకోవాలి. పియర్స్ ను తొక్కతో సహా తీసుకోవడం వల్ల ప్రేగు కదలికలు మెరుగుపడి మలబద్ధకం సమస్య తగ్గుతుంది.

రాస్ప్బెర్రీలు, ఆపిల్స్..

100గ్రాముల రాస్ప్బె ర్రీస్ ను తీసుకోవడం ద్వారా 6 నుండి 7 గ్రాముల ఫైబర్ ను పొందవచ్చు. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, కొలెస్ట్రాల్ ను తగ్గించడంలోఈ ఫైబర్ దోహదపడుతుంది. దీనిలో ఉండే కరగని ఫైబర్ ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇక ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లల్లో ఆపిల్స్ కూడా ఒకటి. మధ్యస్థంగా ఉండే ఒక ఆపిల్ లో దాదాపు 4 నుండి 5 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీనిలో కరిగే ఫైబర్ పెక్టిన్ అధికంగా ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. ఈ ఆపిల్ పండ్లను తొక్కతో సహా తీసుకోవడం ద్వారా అధిక ఫైబర్ ను పొందవచ్చు. అరటిపండ్లల్లో 100గ్రాములకు గాను 2.6 నుండి 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. వీటిలో ఎక్కువగా కరిగే ఫైబర్ ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను నెమ్మదించడంలో ఇది ఉపయోగపడుతుంది.

బ్లాక్ బెర్రీలు..

అలాగే బ్లాక్‌బెర్రీస్ కూడా ఫైబర్ పవర్ హౌస్ అని చెప్పవచ్చు. వీటిలో 100 గ్రాములకు 5 నుండి 7 గ్రాముల ఫైబర్ ఉంటుంది. బ్లాక్‌బెర్రీస్ లో కరిగే, కరగని రెండు రకాల ఫైబర్ లు ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఆరోగ్యకరమైన ప్రేగు పనితీరును ప్రోత్సహించడంలో ఇవి దోహదపడతాయి. అదే విధంగా కివి పండ్లు కూడా 100గ్రాములకు 3 నుండి 4 గ్రాముల ఫైబర్ ను కలిగి ఉంటాయి. వీటిలో కరిగే, కరగని రెండు రకాల ఫైబర్ లు ఉంటాయి. వీటిని తొక్కతో సహా తీసుకోవడం వల్ల అధిక ఫైబర్ ను పొందవచ్చు. ఈ విధంగా రోజూ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత ఫైబర్ లభిస్తుంది.

# ఈ సప్లిమెంట్లను మీరు తరచూ వాడుతున్నారా..? అయితే జాగ్రత్త.. హెచ్చరిస్తున్న వైద్యులు



హెల్త్ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఈ మధ్యకాలంలో చాలా మంది సప్లిమెంట్స్ మీద ఆధారపడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి , పోషక అంతరాలను పూరించడానికి అనేక వనమూలికలను తీసుకుంటున్నారు. ఇవన్నీ కూడా సహజమైనవి, సురక్షితమైనవి అని లేబుల్ చేయబడి ఉంటున్నాయి. దీంతో వీటిని ఉపయోగించే వారు ఇవన్నీ కూడా సురక్షితమైనవి అని భావిస్తున్నారు. కానీ లేబుల్ చేయబడిన మాత్రాన ఇవన్నీ సురక్షితం కావనీ వైద్యులు చెబుతున్నారు. వీటిని వాడడం వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఈ మందులు ముఖ్యమైన అవయవాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. సప్లిమెంట్స్, మూలికా మందులు అందరికీ సురక్షితం కావని ఇవి ఒక్కొక్కరిపై ఒక్కోలా ప్రభావం చూపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. చాలా మంది ఎక్కువగా ఉపయోగించే కొన్ని రకాల సప్లిమెంట్స్, మూలికలు శరీరంపై ఏ విధంగా ప్రభావం చూపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

గ్రీన్ టీ క్యాప్సూల్స్..

గ్రీన్ టీ ని చాలా మంది తాగుతూ ఉంటారు. ఒక కప్పు గ్రీన్ టీ తాగడం సురక్షితమైనదే. అయితే గ్రీన్ టీ ని సులభంగా తయారు చేసి తీసుకోవడానికి చాలా మంది క్యాప్సుల్స్ ను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ క్యాప్సుల్స్ లో అధిక స్థాయిల్లో కాటెకిన్లు ఉంటాయి. ముఖ్యంగా అధిక మొత్తంలో ఉండే జు+జ+ కాలేయ మంటను, తీవ్రమైన కాలేయ అనారోగ్యాన్ని కలిగిస్తుంది. కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడే వారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. కనుక గ్రీన్ టీ క్యాప్సుల్స్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ప్రోటీన్ పౌడర్లు..

అలాగే రోజూ వ్యాయామం చేసేవారు ప్రోటీన్ పౌడర్లను ఎక్కువగా తీసుకుంటారు. కానీ వీటిని వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో నైట్రోజన్ వ్యర్థాలు ఎక్కువగా తయారవుతాయి. ఈ వ్యర్థాలను బయటకు పంపించడానికి మూత్రపిండాలు అదనంగా పని చేయాల్సి వస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడడం వల్ల వాటి పనితీరు మందగించడంతో పాటు మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు ప్రోటీన్ పౌడర్ అవసరమైనప్పటికి దీనిని అతిగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

విటమిన్ సప్లిమెంట్లు..

కొవ్వులో కరిగే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి వాటిని కూడా ఈ మధ్య కాలంలో చాలా మంది తీసుకుంటున్నారు. ఈ విటమిన్లు కొవ్వు కణజాలాల్లో పేరుకుపోతాయి. వీటిని ఎక్కువగా ఎక్కువగా తీసుకోవడం వల్ల కొవ్వు కణజాలల్లో అధికంగా నిల్వ చేయబడతాయి. ముఖ్యంగా విటమిన్ ఎ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. మూత్రపిండాల వ్యాధులు ఉన్న వారు వైద్యుడిని సంప్రదించకుండా ఈ విటమిన్లను తీసుకోకపోవడమే మంచిది. అలాగే ఐరన్ సప్లిమెంట్స్ వాడకం కూడా పెరిగిందని చెప్పవచ్చు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కణజాలాల్లో ఐరన్ పేరుకుపోయి హిమోక్రోమాటోసిస్ అనే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. దీని వల్ల అవయవాల పనితీరు తగ్గుతుంది. దీర్ఘకాలిక నష్టం కలుగుతుంది. అలాగే కాంఫ్రే( సౌరక చెట్టు) వంటి హెర్బల్ మూలికలను ఉపయోగించే వారు కూడా జాగ్రత్తగా ఉండాలి. వీటిలో కాలేయానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించే సమ్మేళనాలు ఉంటాయి. ఈ మూలికలను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

అతిమధురం వేర్లు..

లికోరైస్ రూట్ ను కూడా కొన్ని రకాల నివారణలల్లో ఉపయోగిస్తారు. దీనిని అధికంగా వాడడం వల్ల పొటాషియం స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు తగ్గుతుంది. మూత్రపిండాలు, గుండె జబ్బులతో బాధపడే, అంతర్లీన ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అదే విధంగా డిటాక్స్, కొవ్వును కరిగించే సప్లిమెంట్స్ త్వరిత ఫలితాలను ఇస్తాయి. అయితే ఇవి కాలేయ జీవక్రియ ప్రక్రియను, మూత్రపిండాల వడపోత ప్రక్రియను మందగించేలా చేస్తాయి. వీటిని అధికంగా వాడడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కాలేయ వ్యాధులు ఉన్నవారు మరింత ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సప్లిమెంట్స్ ను, మూలికలను తీసుకోవడం మంచిదే అయినప్పటికీ వీటిని తగిన మోతాదులో వైద్యుడి సూచనల మేరకు ఉపయోగించడం మంచిది. సప్లిమెంట్స్ ను అధికంగా ఉపయోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాలతో పాటు శరీర ఆరోగ్యం కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది కనుక వీటిని తగిన మోతాదులో వైద్యుడిని సంప్రదించిన తరువాత ఉపయోగించడం మంచిది.



# క్రీడలు





## టీమిండియాకు గుడ్ న్యూస్.. వెస్టిండీస్‌పై సౌతాఫ్రికా విజయం



స్పోర్ట్స్ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 ప్రపంచకప్, సూపర్-8లో భాగంగా గుజరాత్‌లోని నరేంద్ర మోడీ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని కేవలం 16.1 ఓవర్లలోనే చేధించింది. మొత్తంగా 16.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి తొమ్మిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. సౌతాఫ్రికా బ్యాటర్లలో కెప్టెన్ మార్క్రమ్(82), క్వింటాన్ డికాక్ (47), రియాన్ రికెల్టన్ (45) పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. విండీస్ బౌలర్లలో రొస్టన్ చేస్ ఒక వికెట్ తీశారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. రొమారియో షెఫర్డ్(52) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. జాసన్ హోల్డర్(49) తృటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. ఇక మిగిలిన బ్యాటర్లంతా విఫలం అయ్యారు. 86 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. కింగ్(21), హోప్(16), హిట్ మేయర్(2), పావెల్(9), రోస్టన్(2), రుథర్‌ఫోర్డ్(12), మాథ్యూ(11) వరుసగా పెవిలియన్ బాట పట్టారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి 3, బోష్, రబాడ తలో 2 వికెట్లు పడగొట్టారు. అయితే.. ఈ మ్యాచ్‌లో విండీస్ గెలిస్తే.. టీమిండియా సెమీస్‌కు వెళ్లడం చాలా కష్టమయ్యేది. దక్షిణాఫ్రికా గెలవడంతో భారత క్రీడాకారులతో, అభిమానులు సౌతాఫ్రికా విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

## నా కొడుకు ఆ అమ్మాయిని పిచ్చిగా ప్రేమించాడు - సచిన్



స్పోర్ట్స్ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అర్జున్ టెండూల్కర్ వివాహంపై సచిన్ టెండూల్కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన కొడుకు చాలా పెద్దవాడు అయ్యాడని.. అతనికి నచ్చిన అమ్మాయి తో పెళ్లి చేయబోతున్నట్లు ప్రకటించారు. నా కొడుకు ఆ అమ్మాయిని పిచ్చిగా ప్రేమించిన నేపథ్యంలోనే పెళ్లికి ఒప్పుకున్నట్లు క్లారిటీ ఇచ్చారు సచిన్ టెండూల్కర్. సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్, సానియా చందోక్ ఇద్దరూ పెళ్లి పీటలు ఎక్కబోతున్న సంగతి తెలిసిందే. మార్చి ఐదవ తేదీన అర్జున్ టెండూల్కర్, సానియా పెళ్లి జరగనుంది. ఈ మేరకు సచిన్ టెండూల్కర్ ఫ్యామిలీ పెళ్లి పనుల్లో ఫుల్ బిజీగా ఉంది.

అర్జున్-సానియా పెళ్లిపై సచిన్ టెండూల్కర్ ఎమోషనల్

వచ్చేవారమే సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, సానియా పెళ్లి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖేష్ అంబానీ ఫ్యామిలీ ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా లిటిల్ మాస్టర్ సచిన్ టెండూల్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ కాస్త ఎమోషనల్ అయ్యారు. తన కొడుకు ఒక అమ్మాయిని ఇంటికి పరిచయం చేసినప్పుడే.. అతడు పెద్దవాడయ్యాడని తనకు అర్థమైనట్లు వెల్లడించారు. వారిద్దరూ ఒకరినొకరు పిచ్చిగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. అర్జున్ తనకి ఇష్టమైన తోడును వెతుక్కున్నందుకు గర్వంగా ఉందని ఎమోషనల్ అయ్యారు సచిన్. తాను కూడా ఈ పెళ్లికి వెంటనే ఒప్పుకున్నట్లు తెలిపారు. అర్జున్ టెండూల్కర్, సానియా కలిసిమెలిసి నిండు నూరేళ్లు ఉండాలని కోరారు. కాగా అర్జున్ టెండూల్కర్ పెళ్లి చేసుకోబోతున్న అమ్మాయి సానియా, ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు కావడం గమనార్హం.

## శ్రీలంకపై కివీస్ విక్టరీ..పాక్ కూడా బ్యాగులు సర్దుకోవాల్సిందే!



స్పోర్ట్స్ న్యూస్, 26 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్ కప్ లో శ్రీలంకతో పాటు పాకిస్తాన్ ఇంటి దారి పట్టాల్సిందేనని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. శ్రీలంక పై న్యూజిలాండ్ విజయం సాధించిన నేపథ్యంలో పాకిస్తాన్ జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. సెమీ ఫైనల్ ఛాన్సులు పూర్తిగా తగ్గిపోయాయి. న్యూజిలాండ్ కంటే పాకిస్తాన్ సెమీ ఫైనల్ కు వెళ్లే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనంతటికి కారణం శ్రీలంకపై న్యూజిలాండ్ గ్రాండ్ విక్టరీ కొట్టడమే.

సెమీ ఫైనల్ లోకి పాకిస్తాన్ అడుగు పెట్టాలంటే ?

ప్రస్తుత పరిస్థితులలో టీ20 వరల్డ్ కప్ సెమీ ఫైనల్ లో పాకిస్తాన్ అడుగు పెట్టాలంటే మిరాకిలే జరగాలని అంటున్నారు క్రీడా విశ్లేషకులు. అయితే పాకిస్తాన్ సెమీ ఫైనల్ కు వెళ్లాలంటే... ఇంగ్లాండ్ చేతిలో న్యూజిలాండ్ భారీ తేడాతో చిత్తుగా ఓడిపోవాలి. ఇక ఆ తర్వాత శ్రీలంక పైన పాకిస్తాన్ విజయం సాధించాలి. సాధారణ విజయం కాకుండా, భారీ విజయాన్ని నమోదు చేసుకోవాలి. అలా చేస్తేనే పాకిస్తాన్ నెట్ రన్ రేట్ పెరుగుతుంది. ఇక ఒకవేళ ఇంగ్లాండ్ జట్టుపై న్యూజిలాండ్ విజయం సాధించినా లేదా ఆ మ్యాచ్ వర్షం కారణంగా జరగకపోతే పాకిస్తాన్ కు షాక్ తప్పదు. అప్పుడు న్యూజిలాండ్ సెమీ ఫైనల్ కు దూసుకు వెళ్తుంది. శ్రీలంక తో పాటు పాకిస్తాన్ కూడా ఇంటికి వెళ్లాల్సి వస్తుంది.

ఇలా పాకిస్తాన్ జట్టు ముందు పెద్ద సవాలే ఉంది. వీటన్నిటిని దాటుకొని పాకిస్తాన్ సెమీ ఫైనల్ కు వెళ్లే మాత్రం ఆ కిక్కే వేరు. మరి ఇందులో ఎవరు సెమీ ఫైనల్ కు వెళ్తారో చూడాలి. గ్రూపు 2లో ఉన్న ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీ ఫైనల్ చేరుకుంది. వరుసగా పాకిస్తాన్, శ్రీ లంక పై విజయం సాధించి నేరుగా సెమీ ఫైనల్ బెర్త్ కన్ఫామ్ చేసుకుంది ఇంగ్లాండ్. ఆతిథ్య శ్రీలంక కూడా ఎలిమినేట్ అయింది. వరుసగా న్యూజిలాండ్, ఇంగ్లాండ్ చేతుల్లో ఓడిన శ్రీ లంక, ఇప్పుడు టీ20 వరల్డ్ కప్ నుంచి వైదొలిగింది. ఇక అటు గ్రూప్ 1లో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ ప్రస్తుత లెక్కల ప్రకారం సెమీ ఫైనల్ లోకి వెళ్లే ఛాన్స్ ఉంటుంది. అయితే ఇవాళ జింబాబ్వే పైన ఇండియా గెలిస్తే పరిస్థితి తారుమారవుతుంది.

ఈ టోర్నమెంట్లో వరుసగా రెండు విజయాలు నమోదు చేస్తేనే ఇండియా సెమీ ఫైనల్ కు వెళుతుంది. లేకపోతే ఇంటి దారి పట్టాల్సిందే. ఇది ఇలా ఉండగా టీ20 వరల్డ్ కప్ లో ఇవాళ మరో రెండు కీలక మ్యాచ్ లు జరగనున్నాయి. ఇందులో మొదట వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ ఫలితం ఇండియా పైన కూడా ఉంటుంది. వెస్టిండీస్ విజయం సాధిస్తే, ఇండియా సెమి ఫైనల్ ఛాన్స్ మరింత తగ్గనుంది. ఇక మరో మ్యాచ్ లో ఇండియా, జింబాబ్వే లాంటి చిన్న జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

KR TV క్రాంతి
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# 'కేరళ స్టోరీ-2' సినిమాపై హైకోర్టు స్టే

## సెన్సార్ బోర్డు తీరుపై తీవ్ర ఆగ్రహం




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'కేరళ స్టోరీ-2' విడుదలకు కేరళ హైకోర్టు బ్రేక్ వేసింది. ఈ చిత్రంపై స్టే విధిస్తూ ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సినిమాలో సామాజిక, మతపరమైన అంశాలకు సంబంధించి తీవ్ర వివాదాస్పద కంటెంట్ ఉందని కోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా ఈ సినిమా ప్రదర్శనకు అనుమతులు మంజూరు చేసిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ తీరుపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

సినిమాలోని అభ్యంతరకర సన్నివేశాలను, సంభాషణలను క్షుణ్ణంగా చూడకుండానే సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ ఎలా ఇచ్చిందని కోర్టు ప్రశ్నించింది. వివాదాస్పద అంశాలు ఉన్నాయని తెలిసినా, సినిమాను సరిగ్గా తనిఖీ చేయకుండానే అనుమతి ఇవ్వడం సరైన పద్ధతి కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సినిమా ప్రదర్శన వల్ల సామాజిక సామరస్యానికి భంగం కలిగే అవకాశం ఉందని భావించిన ధర్మాసనం, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సినిమాను విడుదల చేయకూడదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సెన్సార్ బోర్డు తన బాధ్యతను సక్రమంగా నిర్వహించలేదని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలినట్లయింది. ఈ వివాదంపై తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఒక్కటైన విజయ్-రష్మిక

## రాజస్థాన్‌లో అంగ రంగ వైభవంగా వివాహం!




టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు వివాహబంధంతో ఒక్కటయ్యినట్లు తెలుస్తుంది. గత కొంతకాలంగా వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బుధవారం ఉదయం 10.10 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేశారని సమాచారం. ఈ వివాహ వేడుక రెండు భిన్న సంస్కృతుల కలయికగా అత్యంత వైభవంగా జరుగుతోంది. ఉదయం విజయ్ కుటుంబ సంప్రదాయం ప్రకారం హిందూ పద్ధతిలో పెళ్లి వేడుక పూర్తికాగా, సాయంత్రం 4:30 గంటలకు రష్మిక కుటుంబ ఆచారాల ప్రకారం మరోసారి వివాహం జరగనుంది.

ఈ వేడుక కోసం ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు ఇప్పటికే ఉదయ్‌పూర్ చేరుకున్నారు. పెళ్లికి ముందు జరిగిన సంబరాల్లో భాగంగా ఈ జంట 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బుధవారం జరిగిన హల్దీ వేడుకలకు సంబంధించిన ఫోటోలను కూడా ఈ జంట ఇన్‌స్టా వేదికగా పంచుకోవడంతో అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. తమ అభిమాన నటులు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టడంతో నెటిజన్లు 'విరోష్' జంటకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఉదయ్‌పూర్‌లో సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహం అనంతరం, మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు, రాజకీయ నేతల కోసం భారీ వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

# పెద్ది సెకండ్ సింగిల్

## విడుదల తేదీ వచ్చేసింది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. జాన్వి కపూర్ హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రానికి బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీని ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. చాలా కాలం క్రితమే ఈ సినిమా నుండి చికిరి చికిరి అనే సాంగ్ను విడుదల చేశారు. అది అద్భుతమైన రీతిలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దానితో ఈ సినిమా నుండి సెకండ్ సింగిల్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులతో పాటు మామూలు ప్రేక్షకులు కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.




తాజాగా ఈ మూవీ సెకండ్ సింగిల్ విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. రై రై రారా అంటూ సాగే ఈ మూవీలోని రెండవ సాంగ్ను మార్చి 2వ తేదీన విడుదల చేయనున్నట్లు మూవీ యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మరి ఈ సాంగ్ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని వృద్ధి సినిమాస్, మైత్రి సంస్థ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ల వారు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జగపతిబాబు, శివరాజ్ కుమార్, దివ్యాంధు తదితరులు ఈ సినిమాలో ముఖ్యపాత్రల్లో కనిపించనున్నారు.



# బాయ్‌ఫ్రెండ్ లేడు, ప్రెగ్నెంట్ అయ్యా

## అమలాపాల్ షాకింగ్ కామెంట్స్!

హీరోయిన్ అమలాపాల్ తన వివాహం గురించి ఆసక్తికర విషయాలు చెప్పారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకున్నారు. ఒక జ్యోతిష్యుడు తన పెళ్లి గురించి ముందే చెప్పాడని వెల్లడించారు. ఆ సమయంలో తనకు బాయ్‌ఫ్రెండ్ కూడా లేదని, అలాంటప్పుడు పెళ్లి ఎలా జరుగుతుందో అనుకున్నానని అమలాపాల్ తెలిపారు. చివరకు తన పెళ్లి విషయంలో జ్యోతిష్యుడు చెప్పిందే నిజమైందని, ఇప్పుడు తాను చాలా సంతోషంగా ఉన్నానని చెప్పుకొచ్చారు.

'ఓ జ్యోతిష్యుడు నా పెళ్లి గురించి ముందే చెప్పాడు. ఆ సమయంలో నాకు బాయ్‌ఫ్రెండ్ కూడా లేడు. అలాంటప్పుడు నా పెళ్లి ఎలా జరుగుతుందో అనుకున్నా. అయితే ఆ జ్యోతిష్యుడు చెప్పిన కొద్ది రోజులకే గోవాలో జగత్ దేశాయ్‌ను కలిశా. అక్కడి నుంచి మా పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలానికే ప్రెగ్నెంట్ అయ్యాను. ఆ సమయంలో పెళ్లి గురించి ఆలోచించకపోయినా.. అప్పుడున్న పరిస్థితుల్లో వివాహం తప్పనిసరి అయింది. మా జీవితంలో ఈ పరిణామాలు చాలా త్వరగా జరిగిపోయాయి. ఇప్పుడు వాటిని గుర్తు చేసుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. జీవితంలో అనుకోకుండా జరిగే సంఘటనలు మన గమ్యాన్ని ఎలా మార్చేస్తాయో చెప్పాడని నేనే ఉదాహరణ. ఇప్పుడు నేను హ్యాపీగా ఉన్నా' అని అమలాపాల్ చెప్పారు.

అమలాపాల్ ఓ సమయంలో వరుస విజయాలతో దూసుకుపోయారు. ఆ సమయంలో తమిళ దర్శకుడు ఏఎల్ విజయ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే వారి బంధం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. 2017లో విజయ్, అమలాలు తమ మూడేళ్ల వైవాహిక బంధానికి స్వస్తి చెప్పారు. ఆ సమయంలో అమలా ఎన్నో సమస్యలు, విమర్శలు ఎదుర్కొన్నారు. కెరీర్ కూడా అంతంతమాత్రంగానే సాగింది. అలాంటి సమయంలో అమలకు జగత్ దేశాయ్ పరిచయమ్యాడు. అమలకు అండగా నిలిచాడు. దీంతో వీరిద్దరి మధ్య స్నేహం చిగురించింది. ఆ స్నేహం ప్రేమగా మారడంతో.. 2023లో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు 2024లో కుమారుడు జన్మించాడు.

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com